క్లుప్తంగా

22 నుంచి దేవీ శరన్నవరాత్రులు



శ్రీ కన్యకా పరమేశ్వరి మాత

శిరివెళ్ల: ఈ నెల 22 వ తేదీ నుంచి దేవీ శరన్నవరాత్రులు ప్రారంభమవుతున్నాయని స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రెసిడెంట్ వంకదార వెంకట నాగ సునీల్ కుమార్ శ్రేష్టి బుధవారం తెలిపారు. వేడుకలలో భాగంగా అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారన్నారు. 22వ తేదీన బాలా త్రిపురసుందరి, 23న గాయత్రి దేవీ, 24న అన్నపూర్ణాదేవీ అలంకారంలో దర్శన మిస్తారన్నారు. 25న కాత్యాయని, 26న, మహాలక్ష్మీదేవీ, 27న లలితా త్రిపురసుందరి దేవీ, 28న స్కంద మాత, 29న సరస్వతీదేవీ అలంకారంలో దర్శన మిస్తారు. 30న దుర్గాదేవి, అక్టోబర్ 1వ తేదీన మహిషాసురమర్ధిని , 2వ తేదీ దసరా పండుగ రోజున విజయలక్ష్మీదేవి అలంకారంలో దర్శనం మివ్వనున్నారు. 3వ తేదీన జరిగే వసంతోత్సవంతో వేడుకలు ముగుస్తాయన్నారు.

నేడు హరివరంలో పశు వైద్య శిబిరం

ఉయ్యాలవాడ: మండలంలోని హరివరం గ్రామంలో గురువారం రాష్ట్రీయ గోకులం మిషన్ కింద ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పశు వైద్యాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొత్తగా 15 మన గ్రోమోర్ కేంద్రాలు



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న జోనల్ మేనేజర్

శిరివెళ్ల: కొత్తగా 15 మన గ్రోమోర్ కేంద్రాలు ఏర్పాటు కానున్నట్లు మన గ్రోమోర్ జోనల్ మేనేజర్ దామోదర్ నాయుడు అన్నారు. బుధవారం స్థానిక మన గ్రోమోర్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలోని ఎరువుల నిల్వలు, అమ్మకాల రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కర్నూల్ జిల్లాలో దొర్నిపాడు, గాజులపల్లె, కొనిదెల, బండిఆత్మకూరులలో కేంద్రాల ఏర్పాటు జరగనున్నాయన్నారు. కేంద్రాల ద్వారా రైతులకు ఎమ్మార్పీకే ఎరువులు, క్రిమి సంహారక మందులు లభిస్తాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు యూరియా, నానో యూరియా అమ్మకాలు కూడా చేపట్టామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏరియా మేనేజర్ సుబ్బారెడ్డి, స్థానిక కేంద్ర మేనేజర్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఔషధ దుష్ప్రభావాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ

గోస్పాడు: ఔషధాలు అధికంగా వాడితే కలిగే దుష్ప్రభావాలపై అవగాహన అవసరమని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ అన్నారు. నంద్యాల మెడికల్ కళాశాలలో బుధవారం ఫార్మకాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ శాంతాబాయి ఆధ్వర్యంలో 5వ జాతీయ ఫార్మకో విజిలెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాది 17 సెప్టెంబర్ నుంచి 23వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏదైనా జబ్బు చేసిన సమయాల్లో పేషెంట్లు మందులు వాడుతుంటారని, కొన్నిసార్లు వాటి వల్ల సైడ్ ఎఫెక్ట్స్ కలిగే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నిరంజన్, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలివ్వాలి

గోస్పాడు: నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాల వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమానికి హాజరైన నంద్యాల పార్లమెంట్ సభ్యులు డాక్టర్ శబరిని కార్మికులతో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు అందడం లేదన్నారు. సంబంధిత కాంట్రాక్టర్, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ జిల్లా నాయకులు ప్రసాద్, చెన్నయ్య, శానిటేషన్ కార్మికులు గురుస్వామి, చెన్నయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యాలవాడ గ్రామ సమీపంలో సాగైన కంది పంట



సుద్దమల్ల గ్రామ సమీపంలో మిరప పంట

తగ్గిన సాగు

- నకాలంలో కురవని వర్షం
- వేధించిన విత్తనాలు, ఎరువుల కొరత
- ప్రభుత్వ నుంచి దక్కని భరోసా
- ఫలితంగా ఖరీఫ్ సాగుపై ఆసక్తి చూపని రైతులు

ఉయ్యాలవాడ : మరో 10 రోజుల్లో ఖరీఫ్ సీజన్ ముగియనుంది. ఏటా ఈ సీజన్‌లో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 25 వేల హెక్టార్లకు పైగా వివిధ పంటలు సాగవుతాయి. అయితే, ఈసారి 18 వేల హెక్టార్లు కూడా మించలేదు. ఇందుకు జూన్,జూలై మాసాల్లో సరైన వర్షాలు కురవకపోవడం ఒక కారణమైతే, విత్తనాలు, ఎరువుల సరఫరాలో కూటమి సర్కారు వైఫల్యం మరో కారణంగా రైతులు చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విత్తనాలు, ఎరువులకు ఇబ్బంది ఉండేది కాదు. దీనికి తోడు నాటి ప్రభుత్వం రైతుభరోసా కింద పంట సాగుకు పెట్టుబడి సాయం అందించేది. దీంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. ప్రస్తుత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని విస్మరిస్తోంది.అన్నదాత సుఖీభవ కింద ఇస్తానన్న రూ. 20 వేలు తొలి ఏడాది ఎగ్గొట్టింది. రెండో ఏడాదికి సంబంధించి ఇటీవల కేవలం రూ. 5 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంది. ఇవన్నీ ఖరీఫ్‌సాగు విస్తీర్ణం తగ్గడంపై ప్రభావం చూపాయి. ఉయ్యాలవాడ మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 2,975 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు కేవలం 1,846 హెక్టార్లలోనే పంటలు సాగయ్యాయి. ఇందులో వరి 795 హెక్టార్లు, మొక్కజొన్న 528, కంది 176, పత్తి 98, మినుము 81, మిరప 77, సోయాబీన్ 15, జొన్న 33, పెసర 26, వేరు శనగ 8, బెండ 10, డ్రాగన్ ఫ్రూట్, నన్నారి, బత్తాయి పండ్ల తోటలు 10 హెక్టార్లలో ఇతర పంటలు 6 హెక్టార్లలో వేశారు. కాగా ఆరుతడి పంటలుగా పేరుగాంచిన మిరప, పత్తి సాగు విస్తీర్ణం ఈ ఏడాది భారీగా తగ్గింది.

బెండ రైతుకు బెంగ

దొర్నిపాడు: భారీ వర్షాలు బెండ రైతులను పూర్తిగా దెబ్బతీశాయి. క్వింటా బెండ విత్తనాలు మార్కెట్లో రూ.9 వేలు ఉండటంతో మండలంలోని గుండుపాపల గ్రామంలో 50 ఎకరాలకు పైగా సాగుచేశారు. పంటసాగయినప్పటి నుంచి ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తుండటంతో మొక్కల పెరుగుదల లోపించింది. అలాగే కలుపు మొక్కలు కూడా అమాంతంగా పెరగడంతో దిగుబడులపై ప్రభావం పడింది. మామూలుగా ఎకరానికి 7 నుంచి 9 క్వింటాళ్ల వరకు దిగుబడులు రావాల్సి ఉండగా ప్రస్తుతం మొక్కలకు కాసిన బెండకాయలను బట్టి చూస్తే రెండు క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికే ఎకరానికి రూ.20వేలకు పైగా పెట్టుబడులు వెచ్చించారు. మొదట్లో కాయకూరలకు బెండ కోసి మార్కెట్లో విక్రయించుకున్నా పెట్టుబడులు వచ్చేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముదురు బెండకాయలు కావడంతో ఎటూ కాకుండా పోయాయంటున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.



గుండుపాపల గ్రామంలో ఇంకా నీటిలోనే బెండ పంట

ఆరోగ్యకర జీవనంపై దృష్టి సారించాలి





గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ ,ఆలమూరులో మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

గోస్పాడు: మహిళలు ఆరోగ్యకర జీవన శైలిపై దృష్టిసారించాలని స్టేట్ అబ్జర్వర్ డాక్టర్ విద్యాసాగర్ అన్నారు. నంద్యాల ప్రభుత్వాసుపత్రి సమావేశ భవనంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి ఆధ్వర్యంలో బుధవారం 'స్వస్థ నారీ–శశక్తి పరివార్ అభియాన్' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్యానికి సంబంధించిన ఈ ప్రత్యేక కార్యక్రమం అక్టోబర్ 2వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణను మరింత బలోపేతం చేయడం, కుటుంబ సుభిక్షానికి పునాది వేయడం కార్యక్రమ లక్ష్యమని వివరించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మహిళలు అందుబాటులో ఉన్న వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది రక్తహీనత సమస్యలపై పరీక్షలు, సలహాలు, గర్భధారణ జాగ్రత్తలు, తల్లీ బిడ్డ ఆరోగ్యానికి వైద్య సూచనలు, ప్రసూతి అనంతరం సంరక్షణ, స్త్రీ రోగాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీ శబరి, డాక్టర్లు కాంతారావునాయక్, అంకిరెడ్డి, భరత్‌కుమార్, రూపేంద్రనాథ్‌రెడ్డి, ప్రసన్నలక్ష్మీ, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా ఆరోగ్యంగా ఉండాలి

దొర్నిపాడు: బలమైన కుటుంబాల కోసం ప్రతి మహిళా ఆరోగ్యంగా ఉండాలని డబ్ల్యూ కొత్తపల్లె పీహెసీ వైద్యాధికారి ఉసేని నేగశ అన్నారు. బుధవారం 'స్వస్థ నారీ–శశక్తి పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని చాకరాజువేముల, యాళ్లూరు–1, 2, ఎం.క్రిష్ణాపురం, డబ్ల్యూ కొత్తపల్లె గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేశారు. మహిళలకు రక్తపోటు, మదుమేహం, నోటిక్యాన్సర్, రొమ్ము, గర్భాశయ కాన్సర్ వంటి వ్యాధులకు స్క్రీనింగ్ చేశారు. అలాగే రాష్ట్రీయ పోషణ్ మాసం ప్రారంభం సందర్భంగా గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు.

రుద్రవరం: మహిళ ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబ శక్తివంతంగా ఉంటుందని వైద్యులు అమర్నాథరెడ్డి, నాగశ్రీజారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆలమూరు పీహెచ్‌సీలో బుధవారం 'స్వస్థ నారీ–శశక్తి పరివార్ అభియాన్' అభియాన్‌లో భాగంగా మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేటి నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18వ తేదీన ఆలమూరు పీహెచ్‌సీలో, 19వ తేదీన మంద లూరులో, అక్టోబర్ 1వ తేదీన చిత్రేనిపల్లె, ముత్తలూరు హెల్త్ సెంటర్లలో వైద్య శిబిరాలు ఉంటాయని వాటిని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రత్నాలు, హెల్త్ సూపర్‌వైజర్లు రసూల్, మల్లీశ్వరీ ఉన్నారు.

స్వచ్ఛతా హీ సేవలో భాగస్వామ్యం కావాలి



స్వచ్ఛతా హీ సేవపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: స్వచ్ఛతా హీ సేవ ప్రతి ఒక్కరి జీవనంలో భాగస్వామ్యం కావాలని ఆళ్లగడ్డ మున్సిపల్ మేనేజర్ ఆనంద్ తెలిపారు. బుధవారం స్థానిక పురపాలక కార్యాలయం నుంచి స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంత మార్కెట్‌లో పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలు స్వచ్ఛంగా ఉంటే ఆరోగ్యాలు బాగుంటాయన్నారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛ వాతావరణానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నంద్యాల(న్యూటౌన్) ఉమ్మడి జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 69వ నెట్ బాల్ ఎంపిక పోటీల్లో ఎస్‌డీఆర్ వరల్డ్ స్కూలు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.ఈ స్కూల్ నుంచి జిల్లా జట్టుకు అండర్ 14 విభాగంలో గురుచరణ్, కార్తికేయరెడ్డి, అండర్ 17 విభాగంలో వినోద్‌కుమార్, రితేష్‌రెడ్డి ఎంపికైనట్లు పాఠశాల అధినేత కొండారెడ్డి తెలిపారు. త్వరలో వీరు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆశ్మా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు



ఆటోపై అంత్యక్రియలకు తీసుకెళ్తున్న దృశ్యం

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడులో బుధవారం చెట్టుపై నుంచి వానరం కిందపడింది. తోటి వానరాలు దాని చుట్టు గుమి కూడి అరుస్తుండగా స్థానికులు వెళ్లి చూడగా మృతి చెంది ఉంది. ఈ విషయం తెలుసుకున్న సామాజిక సేవకుడు దొర్నాల శ్రీధర్‌శర్మ వానరానికి అంత్యక్రియలు చేశారు. డప్పు వాయిద్యాల మధ్య వాహనంలో తీసుకెళ్లి సంప్రదాయ బద్ధంగా అన్నీ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సమయంలో తోటి కోతులు అరుపులు ఆశ్చర్యానికి గురిచేశాయి.

నేడు సీఎఫ్ బాధ్యతల స్వీకరణ

కర్నూలు కల్చరల్: కర్నూలు సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీఎఫ్)గా ఐఎఫ్ఎస్ బీవీఏ కృష్ణమూర్తి గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇటీవల జరిగిన ఐఎఫ్ఎస్ బదిలీల్లో భాగంగా శ్రీశైలం ప్రాజెక్ట్ టైగర్ సర్కిల్ ఫీల్డ్ డైరెక్టర్‌గా ఉన్న ఈయన్ను కర్నూలుకు బదిలీ చేశారు. ఇక్కడ ఇన్‌చార్జ్ సీఎఫ్‌గా ఉన్న యశోదాబాయి బుధవారం రిలీవ్ అయ్యారు.

సురవరం బాటలో నడుద్దాం



సుధాకర్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): సురవరం సుధాకర్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకొని ప్రజా సమస్యలపై పోరాడాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ పేర్కొన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాలలో సీపీఐ మాజీ జాతీయ ప్రదాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. సీపీఐ జిల్లా ప్రదాన కార్యదర్శి రంగనాయుడు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా వనజతో పాటు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, సాగునీటి సాధన సమితి వ్యవస్థాపకులు బొజ్జాదశరథరామిరెడ్డి, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ హాజరై మాట్లాడారు. జిల్లాకు చెందిన సురవరం సుధాకర్‌రెడ్డి కుటుంబం మొదటినుంచి ఉద్యమ బాటలో ఉందన్నారు. రాజకీయాల్లోకి వచ్చాక సుధాకర్‌రెడ్డి విద్యార్థి సంఘాలను బలోపేతం చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. అనంతరం సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, ఫిరోజ్, మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణ రెడ్డి, శంకరయ్య, ఉమామహేశ్వరరెడ్డి, శణ్ముకరావు, మాజీ జాతీయ అధ్యక్షుడు మురళీధర్, పులికొండన్న, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, సుశీలమ్మ, కళాకారులు శివయ్య, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 2,13,384 హెక్టార్లలో పంటల సాగు



ఉయ్యాలవాడలో వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మద్దిలేటి

ఉయ్యాలవాడ: జిల్లాలో ఈ ఏడాది సాధారణ సాగు విస్తీర్ణం ఖరీఫ్‌లో 2,38,214 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 2,13,384 హెక్టార్లలో రైతులు పంటలు వేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి మద్దిలేటి తెలిపారు. బుధవారం మండలంలోని ఇంజేడు, ఉయ్యాలవాడ, అల్లూరు గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి, మొక్కజొన్న, పత్తి, తదితర పంటలను కోవెలకుంట్ల వ్యవసాయ సంచాలకులు సుధాకర్‌తో కలిసి డీఏఓ పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్‌లో ప్రధాన పంటలైన వరి 63,818 హెక్టార్లు, మొక్కజొన్న 61,924, కంది 36,243, మినుము 9,644, సోయాబీన్ 4,176, పత్తి 5,399, వేరుశనగ 7,319, మిరప 3,154 హెక్టార్లలో సాగైనట్లు పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ పంటలకు ఇంకా 10 రోజుల సమయం ఉందని చెప్పారు. జిల్లాలో ఈ ఏడాది పత్తి, మిరప పంటల సాగు విస్తీర్ణం భారీగా తగ్గగా..వరి, మొక్కజొన్న పంటల సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. జిల్లాలో 44,778 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటి వరకు 47,267 మెట్రిక్ టన్నుల సరఫరా అయినట్లు తెలిపారు. 109 షాపుల్లో యూరియా తనిఖీలు నిర్వహించామన్నారు. పది షాపులపై 6ఎ కేసులు నమోదు, 83.5 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. వీటి విలువ రూ. 11.05 లక్షలని వివరించారు. కోవెలకుంట్ల సబ్ డివిజన్ పరిధిలో రైతులు ఎక్కువ శాతం ఖరీఫ్‌లో పంటలు సాగు చేయకుండా భూమిని ఖాళీగా వుంచారన్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించి ఖరీఫ్‌లో పంటలు సాగు చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసులురెడ్డి, ఏఈఓలు రాణెమ్మ, సునీతలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో విజ్ఞానం పెంపునకు కృషి



రుద్రవరం మోడల్ పాఠశాలలో దిన పత్రికలు చదువుతున్న విద్యార్థులు

రుద్రవరం: విద్యార్థుల్లో విజ్ఞానం పెంపునకు కృషి చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని తువ్వపల్లె తిప్ప మీదున్న ఏపీ మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయ బృందం బుధవారం విద్యార్థులతో ఇంగ్లిష్ దిన పత్రికలను చదివించారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్ర సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల చొరవతో తెలుగు, ఇంగ్లిష్ ఉపాధ్యాయుల సమక్షంలో 6,7వ తరగతి విద్యార్థులతో దిన పత్రికలు చదివించామన్నారు.అలా చదివించడం ద్వారా దేశీయ,అంతర్జాతీయ సంఘటనలపై అవగాహన పెంచుకుంటారని అన్నారు. అలాగే వార్తలు చదవడం ముఖ్యమైన పదాలు గుర్తించి ఒకరి నొకరు చర్చించుకోవడంతో జ్ఞానం , భాషా నైపుణ్యం తెలుసుకుంటారని అన్నారు.

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవం



యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల విరాట్ విశ్వకర్మ అన్నదాన సత్రంలో బుధవారం విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని వేదపండితుల చేత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశ్వకర్మ సుప్రభాతసేవ, గణపతిపూజ, పుణ్యాహవాచన, విశ్వకర్మ కలశపూజ, పతాకావిష్కరణ, గాయిత్రీ సమేత విశ్వకర్మ భగవానుల యజ్ఞం నిర్వహించారు. ప్రపంచశాంతి, సౌభాగ్యాల కోసం, సమస్త మానవజాతి సుఖసంతోషాలతో ఉండాలని మహాయజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో విరాట్ విశ్వకర్మ సత్రం అధ్యక్షులు ముత్తలూరి బాలయ్య ఆచారి, ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల నరసింహారావు, కోశాధికారి పాలెపు నాగభూషణాచారి, గౌరవ సలహాదారులు నూతక్కి వెంకటేశ్వరరావు ఆచారి, కార్యదర్శి లింగాల సాయిబాబు ఆచారి, మేనేజర్ సిద్దార్థ పాల్గొన్నారు.

బ్లాక్ బర్లీ పొగాకు సాగు నిషేధం

కొత్తపల్లి: బ్లాక్ బర్లీ పొగాకు సాగును ప్రభుత్వం నిషేధించిందని మండల వ్యవసాయాధికారి అమిరున్నీసా బేగం తెలిపారు. బుధవారం దుద్యాల, గోకవరం గ్రామాల పరిధిలో పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బ్లాక్ బర్లీ పొగాకు ప్రోత్సహించరాదరి రైతులకు సూచించారు. వైట్ బర్లీ పొగాకును సాగు చేసుకోవచ్చన్నారు. రైతులు కంపెనీలతో తప్పనిసరిగా ఒప్పందం చేసుకోవాలన్నారు. ఒప్పందం లేకుండా సాగు చేస్తే.. దిగుబడుల నిల్వలు, విక్రయాలకు ప్రభుత్వం బాధ్యత వహించదన్నారు.

- బండి ఆత్మకూరు: రైతులు వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఆర్ పవన్‌కుమార్ సూచించారు. కడమల కాలువ గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ మండలంలో వరి పంట పిలక దశ నుంచి ఈనె దశలో ఉన్నందున ఆకు ముడత, కాండం తొలిచే పురుగు ఆశించే ప్రమాదం ఉందన్నారు. సోలార్ దీపపు ఎర లేదా లింగాకర్షక బుట్టలను అమర్చుకోవడం ద్వారా వాటిని నివారించుకోవచ్చన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాణ్యం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సో హెల్‌బాషా, సుబ్బమ్మ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 16న కర్నూ లు అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థా యి అండర్–14 విభాగం పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలక ఎంపికైనట్లు హెచ్ ఎం రాములు నాయక్ తెలిపారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన పీఈటీ వెంకటేశ్వరరెడ్డి,అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి, వెంకటరమణ, ప్రసాద్, పవన్, ప్రభాకర్‌రెడ్డి, సువర్ణ, ప్రతాప్‌రెడ్డి తదితరులను హెచ్‌ఎం అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

విద్యార్థులు రక్తదానం



నంద్యాల(న్యూటౌన్): ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం గురు రాఘవేంద్ర బ్యాంకు కోచింగ్ సెంటర్ విద్యార్థులు విజయ బ్లడ్ బ్యాంక్ నిర్వహణలో రక్తదానం చేశారు. శిబిరాన్ని గురు రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి ప్రారంభించారు. 25 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ ప్రధాని జన్మదినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్యాంకు కోచింగ్ సెంటర్ ఏఓ సాయి శ్రీధర్, గురురాజ స్కూలు కోఆర్డినేటర్ రామలింగం, ఆది కేశవరెడ్డి, రక్తదాన శిబిరాల నిర్వాహకుడు దాదా, విజయ బ్లడ్ బ్యాంక్ ఉద్యోగులు శిరీషా, భరత్ పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలపై చలో విజయవాడ



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

నంద్యాల(న్యూటౌన్): ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 18న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్, కోశాధికారి చౌడప్ప అన్నారు. బుధవారం నంద్యాలలో ఆటో కార్మికులు సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాహన మిత్ర పథకం కింద రూ.15 వేలు కాకుండా ప్రతి కార్మికుడికి రూ.30 వేలు ఇవ్వాలని, ఆటో డ్రైవర్ ప్రమాదంలో చనిపోతే రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చదువుకున్న విద్యార్హతను బట్టి ఆర్టీసీలో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సహజ మరణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, గౌండాలకు ఇస్తున్న సంక్షేమ బోర్డు ప్రకారం ఆటో డ్రైవర్లకు కూడా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, 50 సంవత్సరాలు దాటిన ప్రతి ఆటో డ్రైవర్‌కు నెలకు పింఛన్ ఇవ్వాలని, ఫిట్‌నెస్ (ఎఫ్‌సీ) ప్రైవేటు సంస్థలకు కాకుండా ప్రభుత్వం పాత విధానాన్ని అమలు చేసి ప్రభుత్వమే నడపాలన్నారు. నంద్యాల పట్టణంలో పోలీసులు, ఆర్టీఓ అధికారుల వేధింపులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు యాకోబ్, ఆనంద్, ఫరూక్, ఆటో యూనియన్ నాయకులు రాజు, వెంకటేశ్వర్లు, బాషా, లక్ష్మయ్య, ఖాదర్, నూర్‌బాషాపాల్గొన్నారు.

రోడ్డు పక్కన ఉల్లి పారబోత



గార్గేయపురం సమీపంలో రోడ్డు పక్కన పడేసిన ఉల్లి బస్తాలు

కర్నూలు(రూరల్): జిల్లాలో ఉల్లి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అసమర్థత కారణంగా కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి నిల్వలు పేరుకు పోయాయి. కొనే వారు లేకపోవడంతో రోజూ వందలాది క్వింటాళ్ల ఉల్లి కుళ్లి పోతుంది. యార్డు లో ఉల్లి నిల్వలు పేరుకుపోవడంతో వందల క్వింటాళ్ల ఉల్లిని అధికారులు, మార్క్‌ఫెడ్ వారు గార్గేయపురం డంప్ యార్డులో పడేస్తున్నారు. రోజురోజుకు యా ర్డులో ఉల్లి నిల్వలు పెరుగుతున్నా యే తప్పా తగ్గడం లేదు. దీంతో మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లి బస్తాలు, యార్డులోని ఉల్లి నిల్వలను ఏంచేయాలో అధికారులకు దిక్కు తోచడం లేదు. ఈ స్థితిలో బుధవారం మధ్యాహ్నం టిప్పర్ లారీలో ఉల్లి బస్తాలను తీసుకొచ్చి గార్గేయపురం దర్గా సమీపాన నగర పాలక సంస్థ డంప్ యార్డుకు వెళ్లే దారిలో రోడ్డు పక్కన పడేశారు. దాదాపు 200 ఉల్లి బస్తాలను పడేసినట్లు తెలుస్తోంది. ఉల్లికి గిట్టుబాటు ధర లేక ఇక్కడ తెచ్చి పడేశారా? లేక నగరంలోని మార్కెట్ యార్డు అధికారులు ఉల్లి దిగుబడులను తెచ్చి పడేశారా? అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. పడేసిన ఉల్లి బస్తాలను గార్గేయపురం, సమీప గ్రామాల ప్రజలు ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో, భుజాన వేసుకొని కొందరు ఎత్తుకెళ్లిపోయారు.